# ప్రాసక్రీడలు

**శ్రీ శ్రీ**

అరెయార్ ఇధరావ్ దేఖో
ఆంధ్రుల దినపత్రిక
పెట్టుబడికి కట్టుకథకి
పుట్టిన విషపుత్రిక

పతాకాల తలరాతల
పసందైన బాకా
"ప్రజాస్వామ్య" పార్టీలకు
పదేపదే కాకా

పండుగలకు పబ్బాలకు
ప్రత్యేక ప్రచురణలు
వ్యాపారం సాక్షిగా
సాగిందికి ప్రకటనలు

యథాస్థితికి కంచుకోట
ఆస్తికి పోలీసు
అతివాదుల తడాఖాకి
ఆఖరి నోటీసు

స్వాతంత్ర్యఖాది ఖాదీతో
తయారైన బావుటా
పరమపదించిన పెద్దల
భావాలకి కాగడా

సమకాలిక సంఘటనల
కర్పించే స్వాగతం
పకోడీల పొట్లాలకు
పనికొచ్చే కాగితం

గోమాతకు రెండు తలల
కొడుకులు వెలిశారట
గోసాయికి నెత్తిమీద
కొమ్ములు మొలిచాయట

అరెభాయ్ ఆంఖేఁ ఖోల్కే
దేఖో యే జమానా
ఆదిలేదు అంతులేదు
లేదులేదు నమూనా